అభినవసరస్వతి

సంపుట 5. | జానపాడు ప్రమాదీచ సం॥ మార్గశిరమాసము | సంచిక 12.

స్వవిషయము

భగవదనుగ్రహమువలన మాపత్రికాబాలకుఁబంచసంవత్సరములుపూర్తియయ్యె. మరల జనవరినుండి 6 వ సంపుటము ప్రారంభింపఁబడును. ఇదివఱకు మాపత్రికం గ్రహించువారల కందఱకుం గ్రమంబుగ 6 వ సంపుటము ప్రథమమునుండియుఁ బంపుచుందుము. వారలెల్లరును నభిమానించి పత్రికం గ్రైకొని చందాయిచ్చుచుంటకై ప్రార్థితులు. గడచినవత్సరము చాలమంది పంపినంతవఱకు పత్రికం గ్రైకొని చందాకు వీపీ చేసినప్పుడు మాత్రము మరలించియున్నవారు. అట్టిపని బుద్ధిమంతుల లక్షణము కాదని యేరికిఁదెలియకయుండలేదు. ఇదిగాక కొంతమంది నవనాగరికులు పిలువనిపేరంటముగవచ్చి పత్రికపైఁగల తమయాదరముంజూపించుచుఁ దమవిమాత్రమేకాక తమ స్నేహితులని మఱికొందఱి పేరులుకూడ వ్రాసియిచ్చి యందఱికిం బత్రికబంపఁగోరి కొన్నిసంచికలందుకొని వీపీలు త్రిప్పికొట్టినవారై మాయుత్సాహమునకుఁ జాల భంగముకలిగించియున్నవారు. "దూరాదేవనమోనమో నమ ఇదం తేభ్యోపి, కింకుర్మహే, శక్తానైవనయాం, బలీసయమునాభ్రాతిస్తివానాస్తివా" ఈధూర్తుల యకృత్యమునకై వగవనేల? బొఱ్ఱపిఱ్ఱ గలిగిన పెద్దమనుష్యులే కొందఱు మాచందాబొక్కుపై దస్కతు చేయుటచేఁ దమ యంగీకారమున్ వ్యక్తీకరించి కొన్నిసంచికలఁగైకొనియు వీపీప్యాకెట్టులంపినప్పు డనంగీకారమున్ వ్యక్తీకరించుచు వానిపైఁగూడ దస్కతుచేసిరి. పరస్పరవిరుద్ధకర్మములగు నేకవస్త్వంగీకారా

నంగీకారముల కపూర్వజ్ఞుల మహోపాస్కులు వెనుదీయక పోవుటట్లుండఁ గలములుకూడ వెనుదీయవయ్యె. సత్యకాలమిట్లు పాడై పోవుచుండ నేమిచేయుటకు నేమియుత్సాహములు కలుగఁగలవు. మామిత్రులప్రేమో లనో మాప్రేమాలనో పత్రికాస్వీకరణమున కురరీకరించినట్లుండి కొన్ని సంచికలు ముట్టినతర్వాత మాకక్కఱ లేదని వ్రాయుమహా పెద్దలొక కొంతమందియు, పంపినసంచికలన్నియు మెల్లఁగగైకొనుచుఁ జందా యడిగినప్పు డొకసంచికకూడ మాకు ముట్టలేదని చెప్పు ప్రాజ్ఞులొక కొంత మందియునై సత్యమునన్నగిల్లి పోవుచున్నయది. ఇదివఱకు మాపత్రికలో, చందాయిచ్చి సహాయముచేసినవారి పేరులే ప్రకటించుచుంటిమి. ఇఁక నిట్లు వీపీలు తిరుగఁగొట్టినవారి పేరులును ప్రతినెలం బ్రచురించి వారియశేషముకూడ వెల్లడిపఱుపఁబడును. ఈపూర్వోక్తులపథముననుసరించి మాయుత్సాహమునకు భంగముగలిగింపకుందురుగాక యని మాచదువరులందఱిని ప్రార్థించుచున్నారము. వచ్చుసంపుటమున శంతనురాజ చరిత్రము, స్వర్ణకారవ్యవహారము మున్నగు మంచిగ్రంథములు ప్రారంభింపఁబడి పత్రిక మఱింత తేజోవంతమై వెలువడుచుండును. గావున భాషాభిమానముగల రసికజనులవశ్యమాదరించుట కభ్యర్థితులు.

కృతివిమర్శనము

బెజవాడ పురవాసులగు మహారాజశ్రీ బేతపూడి భగవంతరావుపంతులుగారిచే రచియింపఁబడి వారిచేతనే విమర్శనార్థము మాకు బంపఁబడినయుపన్యాసమంజరియనునపూర్వగ్రంథము మాకార్యస్థానము నలంకరించి యపరిమితానందమును గలిగించినది. ఈగ్రంథకర్తగారు మాకుఁ గృతపరిచయులు. వీరొక గొప్ప సంస్కర్తలని మేమభిప్రాయపడుచున్నారము. ఇతఃపూర్వము వీరు గాయకసంఘసంస్కరణమును

బూని తతర్ధమైగాన సారమను గ్రంథమున్ వ్రాసి తదభిప్రాయములను దేశోపయోగార్థము నెల్లూరు మొదలు బొబ్బిలివఱకుఁ గల ముఖ్యపట్టణములందెల్ల నుపన్యసించి యచ్చటచ్చటఁ బ్రభులమన్ననలను ఎల్లచోట్లను బ్రజాగౌరవములను బొందినట్లు, ఈగ్రంథాంతమందలి బహుమహాజనాభిప్రాయసూచకపత్రముల వలననే వెల్లడియగుచున్నది ఇపుడు సాహిత్యపారిశ్రామికసంఘముల సంస్కరణమునుబూని యీ గ్రంథమును బ్రకటించినట్లు కనఁబడుచున్నది. ఇందు దేశోద్ధారకులు, కవులు, పత్రికాధిపతులు, ఉపన్యాసకులు, చిత్రలేఖకులు, గానము, వాద్యము, ఆంధ్రభాష, విద్యార్థులు, వ్యాయామము, వ్యాసలేఖనము (కాంపొజిషన్) మొదలగు నిరువదివిషయములు చక్కగాఁ జర్చింపఁబడినవి. ఇందు కవిజనవిద్యార్థిజన సంస్కరణములు మిక్కిలి ముఖ్యములని మాయభిప్రాయము. వీరు లోకమును బ్రమాణముగను, హేతుజ్ఞానము నూతగను జేకొని దీనిని స్వతంత్రమగు లక్షణగ్రంథముగ రచియించిరి. ఇట్టికార్యము ప్రకృతకాలపుఁగవులం దపూర్వముగనే యున్నది. ఇది వచనగ్రంథమేయయినను లక్షణప్రాయమగు భాగములును వివాదాంశములును పద్యములుగఁగూడ వ్రాయఁబడినవి. ఈ దృష్టాంతములఁ జూడనగును.

"క॥ ధ్వనిమార్దవకాఠిన్యము
లును, ధ్వనిపైకెక్కుడిగుటలును, వర్ణములున్
కనుమోము మార్పు, లభినయ
మన నంగము లైదు భాషకగు భావములై

గీ॥ భాష నెడఁబాసి ధ్వనిభేద పఙ్క్తులైన
నెంతొ యసమర్థముగ భావమొలుకపఱుచు
గాన ధ్వనిభేదములు భాషకలసిమెలసి

భావమును దెల్పుటదియెంతో బాగుబాగు

ఆ॥ ఎక్కి దిగుటలేని పెక్కుధ్వనులఁగూర్చి
గాత్రగానమందుఁ గలయఁజేర్చి
చిత్రగతుల సభ్య చిత్తరంజకమూచుఁ
బ్రబలుచుందుఁ జర్మవాద్యసమితి"

ఇవి వీరి స్వతంత్ర నిర్వచనములు. వీని వివరణము గ్రంథమందు విపులముగ వ్రాయఁబడినది. ఇట్టి నిర్వచనము లీగ్రంథమం దనేకములు కలవు.

కవులు. చంపకమాల:

"భువిఁగలవారి కెల్లరకు బుద్ధియు విద్యయు జ్ఞానవృద్ధియుఁ
గవివలనన్ లభించుఁ; గవికంటె గురుండొరుఁడుండఁబోవఁ; డా
కవికృతపుస్తకగ్రహణకారుణి యొక్కటికాదె యేరికిన్
వివిధములైన ప్రజ్ఞలఁ బ్రవీణతఁ గూరుచు? నింతెకాక యీ
వివిధకలాభివృద్ధికిఁ గవిత్వమె కారణ; మెట్టులన్న నెం
దెవరెవ రెట్టి విద్దియల నెంతపరిశ్రమముం బొనర్చినన్
దవిలి వినూత్నమార్గములఁ దామె స్వతంత్రముగా గ్రహించినన్
గవియొకఁడుండి వారియెడఁ గల్గు విశేషము లప్పుడప్పుడే
ప్రవిమలరీతి గబ్బముల వ్రాసి స్థిరంబుగ నిల్పకున్నచో
నవియడుగంటి, లాతులకు నబ్బక వారలతోనె పోవుఁ; బై
నెవరెవ రట్టివిద్యలకు నేగిన నెప్పటికప్డె క్రొత్తయై
తవులదు వృద్ధిసుంతయుఁ బదంపడి యెంతప్రయాసఁగొన్న మ
క్కువపడి యెంతమేపినను గొడ్డెరు బెత్తెడెతోఁక రీతిగన్;
జవులు జనింపఁ, దేనియలఁ జల్లినరీతి, మృదూక్తి సంపదన్
ఁ వులకు విందొనర్చుచు వచించెడి సత్కవివాక్కు లేనిచో

భువిఁ బ్రజలొందులోపమది పూడదు మార్గశతాంతరంబులన్"

ఇట్టిమాలిక లీగ్రంధమందుఁ బెక్కులుకలవు. ఇందలి వచనశైలియు, బద్యశైలియు మృదుమధురమై చదివినకొలఁదిని జదువవలయు ననిపించును; అభిప్రాయములు సమంజసములై సంఘాభివృద్ధికి మార్గదర్శకములై యున్నవి. హేతువాదము సర్వజనులను నమ్మింపఁదగియున్నది; సంగీతోపన్యాసములు రెండును మనసాహిత్యపరుల కెల్లరకు నేత్రాంజనప్రాయములగుచున్నవి. వ్యాయామవిషయిక చర్చ హిందూ జనసంఘమునంతను మేలుకొల్పుచున్నది; వ్యాసలేఖనవిధానము పైతరగతులలోని విద్యార్థులకు మార్గదర్శకమగుచున్నది. కావున దీనిని బ్రతియాంధ్రుఁడును శ్రద్ధతోఁ జదువఁదగియుండెననియు, పైతరగతుల లోని ప్రతివిద్యార్థియుఁ బాఠమువలెఁ జదువఁదగియుండెననియు మా యభిప్రాయము.

దీనివెల	మొదటి భాగము రు	0—9—0
	రెండవ భాగము	0—9—0
	రెండు భాగములు	1—0—0

వలయువారు గ్రంధకర్తగారికి బెజవాడకు వ్రాసికొనవలయును

తృణకంకణము:—ఇది యభినవకవితామండలియొక్క ప్రధమాంజలి, ఈమండలి యాంధ్రభాషాభివృద్ధినిగోరి నూతనముగఁ జేరినదై యున్నది. కవితాసామ్రాజ్యమున నవీనకళ్యాణముజరుపుటకై యత్నించుచున్నది. ఈమహాకళ్యాణమునకుఁ బెండ్లిపనులుచేయు తొలిసేవకిసంఘము-మాతృభాషాసేవ చక్కఁగాఁ జేసియున్న శతావధాని వేలూరు శివరామశాస్త్రిగారు మొదలగువారే యేతన్మండలికులు- షేక్స్పియరుమున్నగు ఖండాంతరకవుల వాఙ్మయములోని యాయాభావప్రపంచములను నాయా యధార్థచ్ఛాయలం బ్రతిఫలింపఁజేయుటయందు

వీరిపూర్ణవిశ్వాసము. ఈమండలిప్రచురణములయందు సలక్షణమగు భావకథాముఖము, పాత్రౌచితి వస్తువర్ణన, మున్నగు కవితోపాంగములం గ్రొత్తపోకడ, ప్రకృతిసౌందర్యవర్ణన జీవకళాతత్వ ప్రతిపాదనము, ఆదిగాఁగలగుణములు ప్రత్యేకముగఁ బరిగణింపఁబడును- పైఁజెర్కొనినవిషయములను గొంతవఱకు దృష్టాంతపరచుటకే యీప్రథమాంజలియగుతృణకంకణము ప్రచురింపఁబడినది. ఏతద్గ్రంథకర్తలు రాయప్రోలు సుబ్బారావుగారు. ఆశుకవితాసామ్రాజ్యము మాదియేకాని యన్యులదికాదని వర్తమానసంస్కృతాంధ్రకవులలో నగ్రపీఠార్హులగు తిరుపతివెంకటేశ్వరులసైతము కొప్పరపుసోదరులుఁతప్పఁబలికినతరువాత లీలమైఁ దదాశుకవితసాధించి వాసిగాంచినవారిలో నీయన యొకరు. కవిత్వమతిపేశలము. కమహృద్యము. శుద్ధప్రేమయొక్కస్వరూపమే యిందుఁ బ్రదర్శితము. నిర్గతప్రణయము విశుద్ధప్రేమముగాఁ బ్రతిఫలించు ప్రకృతి రహస్యమే యిందువర్ణితము-అభిప్రాయములు నిగూఢభావజనితములు గానఁ గొందఱకు స్థూలదృష్టిని విపరీతములైతోఁచునేమొకాని చక్కఁగ విమర్శించిచూచిన నెట్టివారికిని నంగీకారములుకాఁగలవు-ఒకస్త్రీపురుషులజంటకతిపయకాలవియోగానంతర సమావేశముననగు పరస్పరాలింగనాదులలో బద్ధస్నేహాయగు ప్రియ మణిబంధమునఁ బ్రేమచిహ్నముగఁ బ్రియునిచేఁ దృణకంకణము-తొడఁగుట యిందలికథాంశమయియుండుటచే నీతృణకంకణాహ్వాయ మిద్దానికివిధింపఁబడియున్నది. ఇది తన్మండలిం జేరిన చావలి వెంకటకృష్ణయ్యగారిచే మా కార్యస్థానమున కనుపఁబడియున్నది. దీనివెల 0-4-0లు ఈగ్రంథమువలయువారుకాని మండలిసమాచారములు తెలిసికొనఁగోరువారుకాని మద్రాసు చింతాద్రిపేటలోని, హెచ్, వి, కృష్ణఅండుకంపెనీ మేనేజరుగారిపేర వ్రాసికొనవలయును.

క్రైస్తవభజనకీర్తనలు:—శ్రీపతి నరశింహారావుపంతులుగారిచే విరచితము. వీరు రాజా మంత్రిప్రెగడ భుజంగరావుగారి కుమారులౌట తన్ముఖవీక్షణముచేతనే కవితారవి యబ్బెనట. "రాజానమనువర్తంతే యథారాజ తథాప్రజాః" అనున్యాయమునఁ గ్రైస్తవప్రాపయోగములగు మత్తయిసువార్తాది పద్యకావ్యములఁ దమయజమానుఁడువ్రాసినట్లే యీయన తద్భజనకీర్తనలు చేసియుండఁబోలు-కాని భుజంగరావుగారు సరసకవితాధురంధరులగుట స్నేహితులగు తన్మతస్థుల కోరికమీఁదనో లేక విలాసముగనో క్రీస్తుప్రభావద్యోతకములగు తద్వార్తలు వ్రాసియుండినను దన్మతమందలి తనయభిరుచిని వెల్లడించి సకలజనులకును నేతన్మతప్రవిష్టులుకండని బోధించియుండలేదు- ప్రకృతగ్రంథకర్తగారట్లుగాక "యేసూసినమ్మనవారము మే మితరాదైవంబులఁ జేరము" "ఏసూభక్తులుగానివారూ మాకు కానూకుకోరగానివారు" "బాపూరేయిటువంటి భగవంతూజేరూట శ్రీపాతినరశింహు పాపాములణుగంటె" అనువాక్యములచేఁదానుగృతార్థమ్మన్యుఁడగు టట్లుండ నితరదేవతలను దద్భక్తులను గూడ నిరసించియున్నవారు. ఈయంశమును "మోసపోతి నిన్ను జేరకేసునువర్జించియింతకు జేసినాడ నితరదైవ సేవలెన్నో తెలియమిచే" అనుపదరత్నము స్పష్టీకరించుచున్నది. నిజమునకు నానారూపధరుఁడగుదేవుఁ డొక్కఁడే వానిని బరమాత్మయనియు శివుఁడనియుఁ విష్ణువనియు, శక్తియనియు, నల్లాయనియుఁ గ్రీస్తువనియు భక్తులు బహువిధంబులఁ గొలిచి కృతార్థులగుట నిక్కమేకాని. బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రాది భేదమునవర్తిలు సకలహైందవులకును ననాదిసిద్ధముగఁ బ్రమాణమునైన శ్రుతిస్మృతిపురాణముల దూరీకరించి వీరిచేదూరాపాస్తమైన యన్యదైవమును సేవించుట యొకటియే యించుక విరుద్ధమైనపనియని మా

యభిప్రాయము. గాని యింతకన్న నన్యమతములపై నూకేమియు ద్వేషభావము లేదు-భవతు, లోకో భిన్నరుచిః, దీనివెల 0-0-6 లఁట. వలయువారు భారతీపేర్ హవుస్. ఏలూరు, అని వ్రాయవలెను.

కారెమపూడిమహాత్స్యవచంపకమాలిక—ఇది 53 చరణములుగలదై చిన్నగ్రంథముగఁ బ్రచురింపఁబడియున్నది. పూర్వము కారెమపూడియుద్ధమున వీరస్వర్గమధిష్ఠించి యిప్పటికిని లింగరూపమున నచ్చోవిరాజిల్లెడి పల్నాటివీరులకుఁ బ్రతివత్సరము జరిగెడి మహోత్సవమిందు వర్ణితము. కవిత మృదుమధురమై విద్వన్మనంబుల నాకర్షింపఁగలదిగానున్నది. గ్రంథకర్త ప్రకృతము గుంటూరుజిల్లాన త్తెనపల్లి తాలూకా క్రోసూరు పోలీసుసబిన్స్పెక్టరుగానుండిన సూరి పూర్ణానందముగారు. కారెమపూడిలోఁగూడఁ గొంతకాల ముద్యోగదశనుండి తదుత్సవసందర్శనజనితహర్షాతిరేకమున నీమాలికరచియించియుండిరి. ఆ యీసంగతులు తెలిసికొనుభారము చదువరుల యందేయుంచి యిందలికొన్ని భాగములీక్రింద నుదహరింపఁబడుచున్నవి.

1 ఉ, ఝుఝుళరావ విస్ఫురిత నాగధునీపరివర్థితామ్ర సం, కలితవనీముహుర్ఘటిత నవ్యజనాంచితమైనతావు.

2 రాజకార్యలయమనఃప్రసక్తి నట నాఁగుటచేతను, పంచరాత్రములో పలుకొలువులో తదంతరములం జనుచుండెను రాచత్రోవగా, వెలసినకళ్ళి పాషనకు వేరగునట్టి విశేషతంత్రముల్, దెలియఁగనయ్యె.

3 మ, జలకల వాగ్విజృంభణముసొంపున మీఱ సిరినాథుఁడన్విశ్రుం, ఖలకవిసార్వభౌమునుతిగాంచిన యీపలనాటిసీమలో, పలఁగల కాశికాపురము, పశ్చిమదిక్సతికర్ణకుండలం, బలసటలేక కన్గొనఁగనయ్యెను.

గారెమపూడిపోడిమిన్, వలయువారు గ్రంథకర్త పేర వ్రాసికొనవలెను.

ఆంధ్రచరిత్రవిమర్శనము.—ఇది జటప్రోలుసంస్థానమువిద్వాంసులగు వెల్లాల సదాశివశాస్త్రిగారిచే వ్రాయఁబడినది. చిలుకూరి వీరభద్రరావుగారి యాంధ్రులచరిత్రముయొక్క ఖండనము. కనుకనే దీనికి గ్రంథకర్తచే "వీరభద్రీయఖండన" మని కూడ నామాంతరమువిధింపఁబడెను. తా మింతకుఁబూర్వము వ్రాసిన వెలమలగు వెలుగోటివారి వంశచరిత్రములోని యంశములను వీరభద్రరావుగా రచ్చటచ్చటఁ దమయాంధ్రచరిత్రములో ఖండించియుండుటంబట్టి సదాశివశాస్త్రిగారు మరల నీయాంధ్రచరిత్రముఁ ఖండించి వ్రాసిరి. రావుగారిచే మిశ్రజాతివారుగాఁబరిగణించి వ్రాయఁబడిన వెలమ కమ్మ కాఁపు వారిని శాస్త్రిగా రుత్తమశూద్రులఁగా ననేక శాసనగ్రంథాదులమూలమున సిద్ధాంతీకరించియుండిరి. తమ న్యాయశాస్త్రప్రవీణతం గనఁబఱచుచు నాయాభాగముల శాస్త్రిలవారు చేసినవిమర్శము విద్వత్పాఠకుల హృదయములనాకర్షించుచున్నయది. ఎఱ్ఱక్కసానమ్మశాసనమున బేతిరెడ్డి ప్రస్తావములోని "యః ప్రీత్యాదదతేర్థితంవసుభృశం" ఇత్యాదిభాగములఁ బ్రయోగింపఁబడిన వర్తమానార్థకములగు దాప్రభృతిధాతువుల లట్ప్రయోగములచే "నాకాలమునకు బేతిరెడ్డి జీవించియుండె" ననుట సరియనియే మానమ్మకము. "బేతిరెడ్డినిగూర్చి బట్టు లసత్యములైన యనేకగాథలనుగల్పించియున్నా" రను వీరభద్రరావుగారి వ్రాఁతకు "భ్రమప్రమాదములతో మెలఁగి రాగద్వేషాదిపరిపూర్ణులైన యస్మదాదులాప్తులు కారనియు మన్వాదిమహర్షులే యట్టివారనియు శాస్త్రకర్తలు నిరూపించియున్నారు. ఇదిగాక "కవీనాముచ్ఛ్రాయసౌందర్యగుణాః మృషోద్యాః కవేరాహార్యవర్ణనమ్" అని మొదలగువచనములచే "బట్టులుమాత్రమే కాక కవులందఱు వర్ణనప్రస్తావమున నయథార్థవాదులే" యని వ్రాసినసమాధాన మెంతసమంజసముగానైన నున్నయది. వర్ణనా

సాహిత్యములగు ప్రబంధములనుండి చరిత్రకుఁగావలసినంత యాథార్థ్యమునే గ్రహించి. శాస్త్రిగారు రావుగారి మతమును ఖండించుచుఁ జక్కగా సమన్వయముచేసియున్నవారు. జేతిరెడ్డి బేతాళనాయఁడు చెవిరెడ్డి నామము లొక్కనికేయనియు నాయన వెంకటగిరిప్రముఖసంస్థానాధిపతులకు మూలపురుషుఁడనియు నెంతయోగ్రంథము పెంచివ్రాయుచు నప్పటిఁ దమపాండిత్యబలముచే మసిఁబూసిమారేడుగాయఁ జేయక యనేకప్రమాణములం గనఁబఱచియుండిరి. పల్నాటివీరులయుద్ధకాలము క్రీ॥ 1182 వ సంవత్సరమని చిలుకూరువీరభద్రరావుగారును, అక్కిరాజు, ఉమాకాంతముగారును మద్దులపల్లిగురుబ్రహ్మముగారును నేకగ్రీవముగా వ్రాసినయంశము ననేకాసంగతప్రదర్శనముచేఁ బూర్వపక్షముచేసి యితరాధారములవలన 1295 వ సంవత్సరమని సిద్ధాంతీకరించియుండిరి. ఆ యసంగతములు "అనుగురాజు కార్తవీర్యుని కేడవతరమువాఁడని వ్రాసినవ్రాఁత నిరాధారపువ్రాఁత" యనియు "మహమ్మదీయులతొందరలవలన.....రాజ్యమునుగోలుపోయి ససైన్యముగఁ బలనాటికివచ్చియుండు" ననియు నేమేమో, అక్కిరాజ, ఉమాకాంతముగారుచూపిన కవి భ్రమప్రమాదాదులేకాక యట్లు నష్టరాజ్యుండై చందోలుప్రభువుచేనరణమీఁబడిన పల్నాటిదేశము నేలెడి యనుగురాజు కొడుకగు నలగామునకు సామంతమహీకాంతులసంతతుల కిరీటరత్నకాంతులచే నీరాజితాంఘ్రియుగళుండగు నోరుగంటిప్రతాపరుద్రుఁ డనాహూతుఁడయి యే వేయియశ్వములుపంపుట, పితృపితామహాదిపరంపరగావచ్చినధరణికోటరాజ్యమనుభవించుచు ఘనతకెక్కియున్న కోటకేతుఁడు రాయబారియగుట, ద్వారసముద్రము రాజధానిగాఁ గృష్ణానది వఱకుగల కర్ణాటదేశమంతయుం బరిపాలించుచుఁ గల్యాణపురాధీశులగు కాలచూరుల జఘుంచి యక్కాలపురాజకోటిలో మేటియైయున్న వీర

భల్లాణుఁడు చతురంగసైన్యములతో సహాయుఁడగుట, లోనుగాఁ గల వెన్నియో యవిశ్వాస్యములగునంశములు కలవు. "పల్నాటివీరులచరిత్రమును గవి మహాభారతమునకనురూపముగ రచియింపనెంచి యనేకవిషయములను దోఁచినట్లుకల్పించినాఁ" డని కొందఱువ్రాయుచ్చుటకూడ దీనికిఁ బ్రోద్బలముగనేయున్నది. కనుకనే శ్రీనాధునికవితాసుధారసమున్గ్రోలి తన్మాధుర్యాదులననుభవించిన మఱికొందఱు "అసందర్భములసంస్కరించి సంభావితంబగునట్లుచేయక పుక్కిటిపురాణములఁబురస్కరించుకొని యితయసంభావితార్థములతోఁ గావ్యరచనచేసినయీకవి యాంధ్రనైషధాదికృతికర్తయై ప్రసిద్ధిగన్నవాఁడుకాఁ" డనియు "ననేకశబ్దదోషములతోఁగనఁబడుదీని నెవఁడోవ్రాసి తనగ్రంథమునకుఁబ్రసిద్ధిరాఁగోరి శ్రీనాధమహాకవిరచియించినట్లువ్రాసియుండు" ననియు ననుచున్నవారు. రావుగారుకూడ నీసంశయముపడియున్నదియే. మూలగ్రంథమునుచ్చుటయేయిటుండ దీనినాధారముగాఁజేసికొనిరచియించిన తరువాతిగ్రంథములలోని పరస్పరవిరోధములు శాస్త్రిగారన్నట్లు నిజముగా వాచామగోచరములే యైయుండనోపు. ధారాశుద్ధికలిగి కథలో నుపమితభారతంబై యుండుటచే వినువారివీనులకు వేడుకగలిగించుచున్నను మాపత్రికలోఁబ్రచురించిన వీరభాగవతమునందును బెక్కు లసంగతములున్నమాట నిజము. కాఁబట్టి యామొదలగుగ్రంథములలోని యసందర్భముల సరిగాఁజర్చించి వలసినంత యాథార్థ్యమునే చరిత్రకారులు గ్రహించుచుండవలెను. అమరావతిలోని కోటకేతునిశాసనమందలి,

శ్లో॥ శాకాబ్దే యుగఖేందురూపగణితే మాఘే దశమ్యాంతిథౌ
శుక్లాయాం గురువాసరే శుభదినే సంప్రాప్తరాజ్యోన్నతిః
శ్రీమత్కేతనృప స్సను స్తగురవే గ్రామాన్ వరేణ్యా న్బహూన్
సంప్రాదా త్సుగతేశ్వరాయ విపులశ్రీబుద్ధసగపద్మతిః

అనుశ్లోకమున కర్థముచేసికొనుటలో నుమాకాంతముగారును వీరభద్రరావుగారును బొరపడినమాట నిజము. అచ్చట "సంప్రాప్త రాజ్యోన్నతిః శ్రీమత్కేతన్నృపః ఏతచ్ఛుభదినే సుగతేశ్వరాయ గ్రామాన్ సంప్రాదాత్" అనియే యన్వయముచేసితీరవలయును. శాసనకారుఁ డిందలిసారమును గ్రింది తెలుఁగుపంక్తులలో స్పష్టముగ వివరించియేయున్నవాఁడు. ఆకాలమున కిటువంటిశాసనములే దానపత్రములు ఈవిషయములో శాస్త్రిగారుచక్కనిశాస్త్రార్థము వ్రాసి తమవ్యాకరణజ్ఞానము వెల్లడిపఱచియున్నవారు శాస్త్రిగారుమద్రాసు నోరియంటల్ లైబ్రరీకేగి యచ్చటి యనేక లిఖితపుస్తకములఁ బరిశీలించియే యీవిమర్శనమునకుఁ గడంగినట్లు వ్రాసికొనిరి కావున వీరుచేసిన కాలనిర్ణయమే సరియనితోఁచెడిని. వెలమ లపకృష్టజాతివారని రావుగారుచూపిన ప్రమాణములకంటె శాస్త్రిగా రుత్కృష్టజాతివారని చూపిన ప్రమాణములే బలవత్తరములైనవని మాయభిప్రాయము. అవి భీమఖండము, పల్నాటి వీరచరిత్రము, సోమదేవరాజీయము, భానుమతీపరిణయము, వాసవదత్తాపరిణయము, రసార్ణవసుధాకరము, చంద్రికాపరిణయము, ఇందుమతీపరిణయము, మున్నగు ప్రబంధములును శాసనములును నై యున్నయవి. "యదువృష్టిభోజాంధకులు గొల్ల"లని రావుగారు పామరులగు గొల్లలు "కృష్ణుఁడుగొల్లయిండ్లలో వసియించుటంజేసి మేముయాదవుల"మని జెప్పికొనువానినమ్మి వ్రాసిరనియే యస్మదూహకూడ. యదువృష్టిభోజాంధకులు చంద్రవంశపురాజులవియన్నియు భాగవతశ్లోకములఁజూపిశాస్త్రిగారుచక్కగవ్రాసియున్నవారు. "నామాంతమున వర్మశబ్దముకలవారు క్షత్రియులేకాని శూద్రక్షత్రియులుకా"రని చెప్పెడిపట్ల దృష్టాంతముగాఁజూపిన తత్వచంద్రికాపంక్తులు శాస్త్రిగారి వేదాంతశాస్త్రప్రవేశమునుగూడఁ దెలుపుచున్న

యవి. రావువంశీయచరిత్రములో గురిజాడ రామమూర్తిపంతులుగారు మార్కండేయపురాణశ్లోకముల వ్రాసి యాక్రిందనిచ్చిన.....శూద్రవేషధారులగు క్షత్రియులు......ఈపద్మనాయకులను నామమునవుండిన శాఖవారుగా ననుమానింపఁబడుదురు అను నభిప్రాయము "అనుమానప్రమాణముచే వీరుగానే స్థిరపడుచున్నారు" అనియే కాని "పద్మనాయకులా? మఱియొకరా" అని సంశయ గ్రస్తమైయుండదు. ఇచ్చటఁ గావలసినంత శాస్త్రార్థమువ్రాసిన శాస్త్రిగారి తర్కపరిజ్ఞానము ప్రశంసాపాత్రము. శాస్త్రిగారుచూపిన గణపతిదేవునిశాసనము గుంటూరుతాలూకా మల్కాపురములోని శివదేవమహాముని శాసనములోనగు వానివలనఁ గాకతివారుక్షత్రియులని యొంచకవీలులేదు కాఁబట్టి తద్వంశజుఁడగు ప్రతాపరుద్రుఁడు పద్మజులకు సపంక్తిభోజనగౌరవమొసంగుట వీరికులౌన్నత్యమునే చాటుచున్నది. ఈవిషయమున రావుగారిమతమును ఖండించు శాస్త్రిగారి పంక్తులు బహుకాలముచుండి రాజస్థానముల విద్వాంసులుగానుండి తత్రత్యగౌరవములఁ జక్కగాఁ గుర్తెఱింగినవారని స్పష్టీకరించుచున్నవి. రావుగారు పల్నాటియుద్ధము కులముపోరని వ్రాసిన దానిపై శాస్త్రిగారు "ఆచరిత్రము సుప్రసిద్ధము కాఁబట్టి దానినిజదివినవారెందఱో యీవిషయము నెఱింగియుండగలరు" అని తత్పాఠకులమీఁదనే యాభారముఁ వదలివేసిరి. ఆచరిత్ర పద్యకావ్యము మాయభినవసరస్వతిలోనే ప్రచురమైయుండుటం జేసియిట మాయభిప్రాయము సంపూర్ణముగా వ్రాసితీఱవలసివచ్చినది. ఇప్పట్లనేకాక యిది వివుర్శ గ్రంథమై పలుచోట్ల విద్వదభిప్రాయమును గ్రంథకర్త కోరియుంటుంజేసి పత్రికాసంపాదకులు సామాన్యముగా నితరగ్రంథములపై నిచ్చెడి యభిప్రాయముకంటె విపులముగా మాయభిప్రాయముందెలుపుట యుచితమైయున్నది.

నాయకురాలికిని బ్రహ్మనాయనికిని బూర్వజన్మవిరోధమే కల దని గ్రంథమునఁ జెప్పఁబడియున్నదికదా! అయ్యది విశ్వాస్యముగాకున్నను నాయకురాలుదుర్మార్గురాలగుటచే బ్రహ్మనాయని యౌన్నత్యముంజూచి సహింపలేక ప్రప్రథమము ప్రభుమంత్రులకు భేదమంకురింపఁజేయుటయు, అనుగురాజు బాలురగు చిన్నభార్యకొడుకుల బ్రహ్మనాయని చేతిలోఁబెట్టి చచ్చుటయు, స్వభావముగా వారు సపత్నీపుత్రులగుటయు, మలిదేవబ్రహ్మనాయలపై నలగామునకు విరోధమేర్పడుటయుఁ గారణంబులయ్యె. అదియేక్రమప్రవృద్ధమగుచుఁగోడిపందెము పెట్టి వారల వలసపాలుచేసెరి. తదనంతరము వారిరాజ్యము వారుకోరఁగా నీయనందున యుద్ధము సన్నిద్ధమయ్యె. ఇంతియేకాని యీయుద్ధమెవ్వారికులమును సాధించుకొనుటకు నేర్పడినదికాదు. ఇఁక బ్రహ్మనాయనితో నెల్లరుం గలసిభుజించుట యాతనిపైఁగల గౌరవప్రపత్తుల వలనఁ గావచ్చును.అతఁడు విష్ణ్వంశసంభూతుఁడని గ్రంథమునవర్ణింపఁబడినందున నాతనితో నెవరుకలసిభుజించినను నింద్యముకాకపోవచ్చును మహాత్ములుగాఁ గనఁబడువారి యుచ్ఛిష్టము బ్రాహ్మణాదులే తినుచుండుట ప్రత్యక్షసిద్ధము. సంఘసంస్కర్తయే యగుటనో యవతారపురుషుఁడేయగుటనో బ్రహ్మనాయనితోఁ గలిసి భుజించిరి కాని యన్యులతోఁగలిసి భుజించినవారుకారు. బాలచంద్రుఁడు యుద్ధమునకు బయలుదేరునపుడు రజకాదులతోఁగలసి భుజించినను బ్రాహ్మణుఁడగు ననపోతరాజును స్వర్ణకారుఁడును వేరుగా ఫలాహారముచేసినట్లే వీరభాగవతమున వర్ణింపఁబడియున్నయది. జాతిభేద మనవసరమని యిప్పటి బుద్ధిమంతులగు కొందఱు బ్రాహ్మణులు చండాలాదులతో సపంక్తిభోజనముచేసినట్లే యప్పుడును సష్టమైనవారు చేసియుందురు. "బ్రహ్మనాయఁడు కులవిచక్షణములేక నిమ్నజాతితోభుజించె" ననియున్న పంక్తినిబుచ్చికొని యందలి కులవిచక్షణశబ్దము

యొక్క సాధుత్వము విషయములో శాస్త్రిగారు రావుగారిని గేలి పుచ్చుటమాత్రము మన్మనంబున కసమాధానమై కనుపట్టెడి. రావుగారు యథార్థజిజ్ఞాసువులనియు సజ్జనులనియు నహంకర్తృత్వాభిమానరహితులనియు నాంధ్రకేసరిలో శాస్త్రిగారి యుత్తరమున కిచ్చిన జవాబు చూచినవారికి బోధపడకమానదు. కావున శబ్దసాధుత్వాదులతో వారి పైఁబరుగిడక చరిత్రయాథార్థ్యముం గూర్చియే చర్చించుకొనుట యావశ్యకము. కేవల సంస్కృత సాహిత్యమంతులకే సరిగా నవగాహన కాఁదగిన శాసనప్రబంధాదులలోని సత్యచరితమునకు భిన్నముగా నొక వేళ రావుగారివ్రాఁత కొన్నిచోట్ల నున్నను బుద్ధిపూర్వకముగ నయథార్థలేఖనమునకుంగడంగు నవిమర్శకులుమాత్రము వారుకారనుట ధ్రువము.

కేవలము వారిచరితమునే చెప్పుటకేర్పడిన వీరచరిత్రాదులకంటె క్రీడాభిరామ మెక్కువప్రమాణమని రావుగారిమతము ననుసరించి "పల్నాటిభూమిపతులు గొల్లసవతితల్లుల బిడ్డ"లని చెప్పుటకు వలనుపడదు. ఆపద్యమందైనను శాస్త్రిచెప్పిన గొల్లసవతితల్లుల బిడ్డలను నదియే లేఖకపరంపరలో గొల్లగామాఱియుండును, వీరభద్రరావుగారి యాంధ్రచరిత్రయు లోకోపకారులగు విజ్ఞానచంద్రికా గ్రంథమండలివారిచే మాకార్యస్థానమున కుచితముగఁ బనుపఁబడి యస్మత్పఠితంబై యున్నయది. అది వారనేకదేశాటనచేసియు ననేకశాసనములఁ బరీక్షించియు ననేకగ్రంథముల శోధించియు వ్రాసినదేకాని యన్యముకాదు. యోగదృష్టిచే సర్వవృత్తము నవగతముచేసికొనఁజాలిన ఋషులు వ్రాసినగ్రంథములయందే కొన్నిచోట్లఁ జరిత్ర నిశ్చయముచేసికొనవీలులేనిపరస్పరవిరోధములుకనఁబడుచుండ రావుగారువ్రాసినప్రాచీనాంధ్రులచరిత్రమునఁగొన్ని విచారణీయాంశములుండుట యొకలోపముకాదు. తమగ్రంథముపైఁ బూర్వపక్షమువ్రాసిరని మఱింతశ్రద్ధచేసి రావుగారివలెనే యనేకశాసనప్రబంధాదులశోధించి వ్రాసినందున శాస్త్రిగారివి

మర్శ మిప్పట్లు నిర్దుష్టముగాఁ గన్పట్టుచున్నది. అందును శాస్త్రులవారు దృఢమైన సంస్కృతాంధ్రపాండిత్యముగలవారగుటయేకాక న్యాయవేదాంతశబ్దాలంకారశాస్త్రపరిజ్ఞానము కలవారగుట స్వపక్షనిర్వాహణమందు రావుగారికంటె సమర్థులయిన శ్రీవిమర్శగ్రంథమువలనఁ గన్పట్టుచున్నయది. కేవల మీయుభయవాదులగ్రంథములేకాక యిందుమతీపరిణయాదులగు మఱికొన్నింటిఁగూడఁ జూచియుండిన మాబుద్ధికిని వెలమ కమ్మ కాఁపువారే నిజమైనశూద్రులనియునందు వెలమలు కేవలముత్తమశూద్రులగుటయేకాక మార్కండేయపురాణములోఁ జెప్పినట్లు పద్మపతిబాధచే జాత్యుచిత సంస్కారహీనులగుట శూద్రప్రాయులైన క్షత్రియులేయనియుఁ బొడకట్టుచున్నయది. కాని శాస్త్రిగారు పద్మజశబ్దము వెలమలయందు యోగరూఢమని సమర్థించుచున్నవారు. పద్మజవ్యవహారముకూడ వీరికెట్లు వర్తించెనో యేమో కాని హరిపాదపద్మమునఁబుట్టిన కమ్మకాఁపులకే పద్మజశబ్దము చెల్లవలసియుండె. పాదకమలమందేపుట్టిక బాహుజులేయై కర్మలోపముచే శూద్రసములైనవారికిఁ బద్మజశబ్దము యోగరూఢమగుట విచారణీయము. పాదపద్మోద్భవులుకూడ నందరూ? పురాణవిరోధమై క్షత్రియత్వహానివచ్చును.

మఱియును, రెడ్డిపదము నామాంతమందుండుట రెడ్లకే లోకమునఁ గనఁబడుచున్నది. "రెడ్డిసంతతికి మాఱొడ్డి భేదంబైనకుల ముద్ధరించిరీవెలమవారు" లోనగు స్తోత్రములకుఁ బాత్రులైన వెలమలగు వెంకటగిరి ప్రముఖసంస్థానాధిపతులకు మూలపురుషుఁడైన బేతినాయఁడు 'బేతిరెడ్డి, చెవిరెడ్డి' యను నామాంతరములచే వ్యవహరింపఁబడుట యాచారవిరుద్ధమై కన్పట్టెడిని.

కావున నీపై రెండుసంశయములును నివర్తిచేయుటకు శ్రీసదాశివశాస్త్రులవారే ప్రార్థితులు.

ఈగ్రంథమువలయువారు నెల్లూరుజిల్లా వెంకటగిరి టౌనునివాసులగు తి. జగన్నాథముగారికి వ్రాసికొనిన నుచితముగలభించును.

మిత్రస్మృతి

అక్కటా! రామశబ్దముసరిగారాని సోమరులే శ్రీమంతులగు పామరులచే శ్రేష్ఠబిరుదప్రదానపూర్వకముగ సత్కరింపఁబడుచుండి "అక్షరం బెఱుఁగక యాకారపుష్టిచేవర్తిలువారు విద్వాంసులైరి" లోనగు వర్ణనలకుఁ బాత్రమైన యిట్టిదుష్కాలము దీలోకమున నుండఁగూడదనియో యేమో ప్రకృతము నలుగురుసంస్కృతపండితులు నాకనివాసముం గావింపనేగిరి. అందు విద్యావాచస్పతిబిరుదాంకితులగు నప్పాశర్మగారినిగూర్చి వెనుక నెలసంచికలో వ్రాసియున్నవారము. నేతిబీరకాయవలెఁగాక నిజమునకుఁ గుండినకవిహంసబిరుదమునకే పండితుఁడుతగియుండెనో యట్టిబెల్లంకొండ రామారావుగారు స్వర్గతులగుటనుగూర్చి యిదివఱకే యాంధ్రవార్తాపత్రికలలోఁబద్యములు ప్రకటింపఁబడియున్నవి కావున నస్మద్విచారముగూడఁ దత్పద్యపఠనముననే వెలిఁబుచ్చుచు రాళ్లభండి వెంకటసుబ్బాశాస్త్రిగారిమరణమునకై కన్నీరు నించుచు, చెళ్లపిళ్ల చినవెంకటశాస్త్రిగారింగూర్చి నొకింతమావిచారముం జూపుచున్నవారము.

ఉ॥ శ్రీపతివేంకటేశకవిశేఖరశిష్యుఁడఖండసాహితీ
వ్యాపకుఁడుత్తముండు రసవత్కవితాపరిశోభి తాంధ్రభ
వ్యాపతి చెళ్లపిళ్లచినవేంకటశాస్త్రిదివంబుఁగన్న సం
తాపపువార్తఁదెల్పుటకుఁ దాళదునెమ్మది కాలచక్రమా॥

చ॥ అమలహృదబ్జపీఠమున నంబరకేశునినిల్పి శిష్యపా
ళిము తమపాలిసామ్మని కడంకవచించుచుఁజిత్తశాంతి, స
త్యము, దయ, యార్జవంబు, కులదైవములంచుఁ దలంచియుత్తమ
కముఁడగు నీబుధుఁ దివముఁ గాంచఁగఁ జేసితె కాలచక్రమా॥

సీ॥ అరయముప్పదిరెండు హాయనంబులవాఁడు, తులలేనిగురుభక్తి వెలయువాఁడు
పరకాంతయెడమాతృభావంబుగలవాఁడు పారమార్థికచింతఁబరఁగువాఁడు
సంపదాపదలందు సమబుద్ధిగలవాఁడు సభకెక్కి మాటాడఁజాలువాఁడు
కృతిరత్నములవ్రాసి కీర్తిఁగాంచినవాఁడు కవివంశమునఁబుట్టి క్రాలువాఁడు
గీ॥ యోగ్యుఁడతిబుద్ధిశాలియనుద్ధతుండు, చెళ్లపిళ్లోపనామక చిన్నవేంక
టేశ్వరబుధుండు స్వర్గమ్మునెనసెనసఁగఁ, గాలచక్రము; దేహంబుకంపమందు॥ 3

మ॥ అకటా! దైవము! సద్గురూత్తమ కటాక్షాంచత్కళావైభవ
ప్రకటానశ్వరకీర్తిమూర్తియగు మిత్రశ్రేష్ఠునిన్ జాలిమా
లికమున్ శీఘ్రమునంపి తేదివికి మేల్దిన్ బ్రమాదీచకా
ర్తికమాసంబునఁ గృష్ణపక్షపుఁజతుర్థిన్ సోమవారంబునన్॥ ౪

మ॥ తన పెంపుంగన నెంచుబంధువుల నంతర్వ్యాత్నయాధర్మప
త్నినిఁబుత్రీద్వయిఁ బెద్దతండ్రి దశేది, గీర్వ్యత్కవిత్వప్రభా
వసధిన్ ధీరునిఁ బెద్దవేంకటకవిన్ వంతన్ గనం జేసిచే
రెను స్వర్గమ్మునఁ జిన్నవేంకటకవిశ్రేష్ఠుండు దైవాజ్ఞచేన్॥ ౫

జానపాటిపట్టాభిరామశాస్త్రి.
అభినవసరస్వతి పత్రికాధిపతి.

పౌండరీకయజ్ఞవైభవము

---:o:---

మాకార్యస్థాన మలంకరించియున్న పౌండరీకవర్ణనావిషయము లగు కొన్ని గద్యపద్యము లిందుఁ బ్రచురింపఁ బోవుచు నందు ముందు మాకుఁ దెలిసియున్నంతవఱకుఁ గర్తృకారయితల ప్రశంస కొంత చేయఁ బూనితిమి. కలిసమావేశంబున బహుజనులు పాపపరాయణులును వర్ణాశ్రమాచారవిహీనులును నీచసేవారక్తులును నిమ్నజాతిప్రవిష్టమనస్కులును బ్రాహ్మణనిందామాత్ర ప్రయోజనులును ఖండాంతరగమనతత్పరులును రజస్వలానంతరవిధవావివాహబద్ధకంకణులును నైయున్న యిక్కాలంబున ధర్మశీలురును సదాచారరతులును దేవబ్రాహ్మణభక్తివిశ్వాస సహితులును నాచరితయజ్ఞ యాగాదిశ్రుతివిహితకర్ములును గడుస్వల్పముగ నుండియుండిరనుట పునరుక్తము- తెలివితేటలువిశేషించి నాగరికత బలసినకొలఁది సన్మార్గము సన్నగిల్లుటయు దుర్మార్గము వృద్ధిఁబొందుటయుఁ గానవచ్చుచున్నయది అందు నిజాము రాజ్యమునఁ జాలభాగము నాగరికత యింకను బ్రబలక జనము జాలవఱకు, పూర్వాచారపరాయణమయియే వర్తిలుచున్నయది. అచ్చటి బ్రాహ్మణు లింతవఱకు స్నానదానవిముఖులును సంధ్యాకర్మదూరులును విధవోద్వాహవాదులును శిఖాయజ్ఞోపవీతరహితులును ధృతకవచభోక్తలును గంధాద్యలంకారశూన్యవక్త్రులును నై చండాలాదులుస్పృశించినవసనములతోడనే భుజించుటలేదు. వైశ్యశూద్రాదులకు బ్రహ్మద్వేషమతిశయింపలేదు. ప్రతిసంఘమందును మహాజనసభలు ప్రత్యబ్దము బయలువెడలలేదు. అట్లుకాక బ్రాహ్మణులు వేదశాస్త్ర

దులనేపఠించి యజ్ఞయాగాదులాచరించుచుఁ బురాణప్రవచనాది స్వవర్ణోచితవృత్తుల వలననే కాలముగడుపుచుండుటయు వైశ్యశూద్రాదులు వారియందత్యంతభక్తితత్పరులై తాము స్వవర్ణోచితధర్మములవలననే తత్పోషణభారమున్వహించి మెలఁగుటయుఁ బ్రచురముగాఁ గన్పట్టుచున్నయది. ఇట్లనుటచే నితరదేశములయందిట్టిసజ్జనులు బొత్తిగాలేరని మాయభిప్రాయమైనట్లు గ్రహింపకుండుటకై చదువరులుప్రార్థితులు. ఆ పూర్వోక్తమగు నిజాము రాజ్యమునఁ జాలభాగము జమీందారులుత్తమశూద్రులలోఁ జేరిన పంటకాఁపులు. వారిసౌజన్యాతిశయము దానధర్మపండిత సత్కారాదులలో జగత్ప్రసిద్ధివడసిన యాత్మకూరు గద్వాల.వనపర్తి ప్రభువులు తద్వర్ణజులనుటచేతనే లోకులకువిశదపడఁ గలదు. అట్టివానిలో మెదక్‌జిల్లాయందుఁగల దొంతిసంస్థానపు విద్వాంసులే యేతత్పౌండరీకయాజులు- వీరిజన్మస్థానము సిద్దిపేటతాలూకాలోని కుక్కునూరుపల్లెయనుగ్రామము. బాల్యమందేవీరు స్వాధ్యాయాధ్యయనమునకుంగడంగి ఘనాంతముంబఠించి పౌండరీకాంతము శ్రౌతమును మంచిసాహిత్యమును సంస్కృతాంధ్రోభయభాషాకవిత్వమును జ్యోతిషమును సాధించి ధర్మశాస్త్రవేత్తలును గానశాస్త్రప్రవిష్టమనీషులును నై మహాప్రతిభమై విరాజిలుచుండ నా దొంతిసంస్థానమునకాచార్యుఁడును భూతదయాపరుఁడును సుగుణఖనియును నగు కొత్తపల్లిరాజేశ్వరాహ్వయస్మార్త బ్రాహ్మణుఁడు తనదుకుమారిని, పాతివ్రత్యరూపలావణ్యాదివర వర్ణనీయను సమర్పించి విధ్యుక్తముగ వివాహమాచరించుటయుఁ దదాది సంస్థానికులు తత్పోషణాదరమతిచేఁ దద్గ్రామముననివసింపఁజేసిరి. ఇట్లచ్చటనివసించి తాము నేర్చినవిద్యల ననేకులచేఁబఠింపఁజేయుచు బహుయజ్ఞముల కర్త్విజ్యము వేయఁ

దగినంతమందిని శ్రౌతవిద్యాసంపన్నులం జేసి యాచరితాగ్నిష్టోమచయనులై యున్న వీరిచేత, నందా తాళాలవెంకటకృష్ణయ్యగారను నొకసజ్జనుఁడు సర్వతోముఖపౌండరీకములను రెండుమహాయజ్ఞములఁ జేయించియుండెను. ఆయనతాతతండ్రులు మాతాలూకా పిన్నెలిగ్రామమున నున్నవారును మాకుబంధువులును, తండ్రికాలముననే నిజామురాజ్యమున కేగుటసంభవించుటయు నీవెంకటకృష్ణయ్యగారు స్వపురుషార్థముచే మెదక్ తాలూకాలోనిదరిపల్లెలో క్షేత్రపాత్రములువిశేషముసంపాదించి సంపన్నగృహస్థుఁడగుటయేగాక దొంతిసంస్థానమున సర్దాధికారముంగూడవహించి రాజ్యతంత్రముం నడపుచు దరిపల్లెలోఁ గృతశివప్రతిష్ఠుఁడై సప్తాహాద్యనేకసత్కార్యములచే ననేకభూతతృప్తింజరిపి పరోపకారపారీణుఁడై వన్నెకెక్కియున్నవాఁడు. చతుర్ద్వారంబులుగలిగి ప్రతిద్వారముననుగల త్రేతాగ్నులతో నగ్నిష్టోమచతుష్టయాత్మకంబయి షట్షష్టిమసంఖ్యాకఋత్విజులసాహాయ్యముతోఁగూడిన సర్వతోముఖము క్రోధివత్సరవైశాఖముననై యున్నయది. పౌండరీకముపరిధావి మాఖశుక్లపూర్ణిమాతిథినారంభింపఁబడి ఫాల్గుణబహుళద్వాదశీతిథితో సమాప్తికావింపఁబడియున్నది. ౪౦ దినములు నిత్యము సహస్రబ్రాహ్మణభోజనముతో విఖ్యాతముగ నిట్టియజ్ఞము చేయించువారు కరమరుదగుట సర్వజనవిదితమకావున వీనికెంతివ్యయప్రయాసలయియుండునో మిక్కిలి వ్రాయఁబనిలేదు. దొంతిసంస్థానాధికారాగధూర్వహులనుటచే తనే తత్సంస్థానికులసహాయము విశేషించియుండితీఱునుగావున వేఱుగా వ్రాయవలసినపనిలేదు. యజ్ఞపుంబ్రాశస్త్యమంతయు నీక్రిందిగద్యపద్యములలో వర్ణింపఁబడియేయున్నయది. కావున విశేషజ్ఞులగుపాఠకులందుగ్రహింపఁగలరని మా లేఖిని నింతటితో నిలుపుచున్నారము.

శ్రీలక్ష్మీనరసింహగురవేనమః

గద్య॥ అస్తిఖలు ప్రశస్తశస్త్రాస్త్రప్రవీణమస్తకాభ్యస్తపద రాజన్యా
ధిష్ఠితా, ...కుల్యోదకప్రదక్షిణీకృతాలవాలవలయశుంభత్త
రుభి రుపవనై రుపశోభితా...యజ్ఞవాటీవ సుజ్ఞాలంకృతా,
యుద్ధభూమిరివ ప్రోద్ధతబాహుజనితవిక్రమా......నదీవ వివిధ
గతివిగ్రహశోభితా, వైశేషికసరణిరివ ద్రవ్యాదిపదార్థశోధినీ
కాచిద్భాగ్యనగరీనామ॥ ౭

శ్లో॥ ఆసీచ్ఛ్రుతదుదగ్దేశే దొంతినామ్నా పురీ క్వచిత్
పంచయోజనదూరేవై రాజకైరుపశోభితా॥ ౮
తస్యామధివసంతిస్మ యాజకావిధుపూజకాః
ఆసోమపౌండరీకాంతక్రతురాజవిరాజితాః॥ ౯
ఖ్యాతా వెంకటనామ్నావై తత్పూర్వాఢ్యరజంశుచం
ప్రభయాంతంగమిష్యంతోదృష్ట్వాణాం దేహజాతయా॥ ౧౦
శ్రౌతే శాస్త్రవిధౌ పురాణనిచయే తంత్రాంగణే నర్తితా
వేదే తత్వదసుక్రమాధికఘనప్రాచుర్యసంశిక్షితా॥
ఆంధ్రప్రాకృతసంస్కృతాదికుశలా విద్వన్మనోరంజనీ
యద్వాణీ వనితేవ కాంతిమయుతే స్వాచాంతవాచాంవరా॥ ౧౧

గద్య॥ సతు నిజవాగ్వైఖరీజితసపత్నవిపశ్చిద్బృందః, కమలాకరఇవమి
త్రోదయప్రహృష్టః, రాజేవద్విజరాజపదభూషితః, ఇంద్రఇవపశు
పురోడాశరసికః, వేదఇవ తదంగపరిశోభితః, విష్ణురివశ్రీరాజితః,
విధిరివకాలాంతరితక్రతుధర్మోద్ధరణపరః, రుద్రఇవసామగాన
ప్రియః, బుధోపి విబుధతుల్యః, గురురపి స్వయంకవితామాకల
య్య తాముఖ్యాస్తే॥ ౧౨

శ్లో॥ లక్ష్మీర్వాక్చావిరోధేన వర్తేతేస్మిన్ తదద్భుతం
అత్యంతవైరవత్యోతే వెంకటాఖ్యబుధేద్వయే॥ ౧౩

శ్లో॥ పూర్వోక్తపురరాజ్ఞాంతు యువరాట్పదభూషితః
ద్విజోవెంకటకృష్ణాఖ్యో ద్విజవాహనపూజకః॥ ౧౭
తత్పురశ్రీటభాగస్థదరిపల్ల్యాఖ్యకేపురే
గృహేవసతితత్రైవ దేవాయతనభూషితే॥ ౧౮

గద్య॥ సోపిపుణ్యశీల స్తీర్థగమనతీర్థకృతాత్మా తీర్థక్రియాతీర్థో ధివసతి
హ్యస్మింతత్పురే॥ ౧౯

శ్లో॥ కలౌపంచసహస్రేషు త్రయోదశసుచోపరి
గతేష్వబ్దేషుకృత్స్నేషు త్రియోదశవత్సరే॥ ౨౧
పరీధావినంపన్నరేస్మిన్ తదంత, స్సమాఘీంసమారభ్య చావత్స
రాంతం।సమానందకందోద్విజోకారయద్యం, సుదోపజ్ఞతద్యాజకైః
పూర్వముక్తః॥

గద్య॥ నతుక్రతువరః......దినదినప్రవృద్ధమానజనసంబాధేన ....
త్వమేకగురుకవిప్రచారోఽహమనేకగురుకవిప్రచారఇతి సుర
లోకమపహసన్నివ, నైరంతరమాకందానోకహచ్ఛాయాదా
నేన సూర్యపీడితాన్ జనాన్ రక్షన్నివ,......అహమాశ్వాయా
స్యే త్వాం పురోగచ్ఛేతి విష్ణువిసర్జితేనైవద్విజరాజేణపరిశోభి
తః, కించ, విధిహుతాగ్నిరపి వివిధహుతాగ్నిః, సమాకందోపి
రమాకందః, సలక్షణోపి విలక్షణః, ఏవంక్రతుఃప్రావర్తత॥ ౨౩

శ్లో॥ ఆద్యబ్రహ్మవిచారోఽఇత్యసూయన్నివచాధ్వరాన్
స్వయమాద్యబ్రహ్మసత్రః పౌండరీకోవ్యరాజత॥ ౨౪

శ్లో॥ విపణ్యా రాజకైశ్చాపి యాజకైః పూజకైరపి
విస్తృతోవస్తుతోఽతీత స్సంస్తుతోభూ త్సమాగతైః ౨౬

అనుష్ఠితోష్టత్రింశద్భిర్దివసైరిష్టిభిస్తతః
దీక్షాభిర్ద్వాదశాఖ్యాభిస్సౌత్యైః పశుభిష్షోడశైర్వృతః ౨౮
ఋత్విగ్భిరష్టాదశభిః పుష్టోహృష్టజనేష్టదః
నిష్ఠాన్విష్టమనోభిశ్చ జుష్టోవైదికపుంగవైః ౨౯

శ్లో॥ యస్మిన్నాగత్యతిష్ఠంత్యవిరతమనఘా విప్రవర్యాశ్చవైశ్యాః
శూద్రా భద్రా మనుష్యాః ప్రతివిపణిపరిక్రీతవస్తుప్రధానాః
సర్వేనిర్వేదమాసన్నిహసవనవిధౌ పుత్రమిత్రాదియుక్తాః
సమ్యక్చావేక్ష్యయజ్ఞంపరిముదితహృదోయాంత్యమీస్వర్గృహాణి౩౦
ఋత్విజోవైదికాశ్చైవ శాస్త్రిణోదత్తదక్షిణాః
కవయశ్చతథైవాన్యే భవనంయాంతిహర్షితాః ౩౧
పుండరీకప్రకల్పిదానాత్పౌండరీకంవిదుర్బుధాః
అతస్తత్పావనంనామ భణ్యతాం సుజనైస్సదా ౩౨
యోమాపతిస్సర్వదైవపూజ్యః కల్యాణసంజ్ఞికః
సయజ్ఞవిష్ణుస్త్రాపాతు యాజివెంకటకృష్ణకౌ ౩౩

శ్లో॥ ఇత్యల్పధీరపిసదా నృహరిః కవితాపదం
గతోఽకరోత్పౌండరీకవర్ణనాం ముత్సతాంభవేత్ . ౩౪

కవితారచనకుఁ బ్రథమావస్థలోనున్నవాఁడై యచ్చటచ్చట కవిస్ఖాలిత్యములుండెనని కాఁబోలుఁ దనదు వచోవిధేయత నీక్రింది శ్లోకములలోఁ జూపియున్నవాఁడు.

శ్లో॥ పుండరీకాక్షదైవత్యం పౌండరీకాహ్వయంమఖం
కోన్వల్పధీఃప్రవర్ణ్యేత పుండరీకాసనంవినా॥౧॥
లజ్జే నాఖ్యాతవేదప్రవచనవిశదం కర్మిభిఃకర్మవిద్భిః
సంపృక్తంపౌండరీకంక్రతువరమనఘంవర్ణయిష్యన్ సదాహం

విప్రో హ్యత్రోప్తపనీతపృథుకవిరళముష్టింధరో దైత్యజిష్ణుం
ప్రాపయ్యాపి ప్రత్రోషం సురజనకథితం కింన లేభే సుఖం సః॥ 3

శ్లో॥ తమద్యవర్ణయిష్యేహ మల్పవాగపి సర్వదా
భాస్కరస్యార్చనాయాంతు దీపాళింనార్చమేతకిం॥ ౨౨॥

ఇందు విద్వద్విధేయతా ప్రతిపాదక వాక్యము లంతగాఁ గానరా కున్నను 'అల్పవాక్, అల్పధీ' అను స్వవిశేషములఁబట్టియైన విద్వాంసులు దోషాన్వేణతత్పరులు కాఁగూడదు.

ఇట్టి విద్వద్వర్ణనములకుఁ బాత్రమై మాముదాల వెంకటకృష్ణయ్యగా రధ్వర్యుఁడుగను బత్తి వెంకటసుబ్బయ్యగారు బ్రహ్మగను నవాజిపురము బుచ్చిరామయ్యగారు హోతగను గుక్కనూరుపల్లె కాసల నరసింహయ్యగా రుద్గాతగను దొంతి వెంకటవరసయ్యగారు సదస్యుఁడుగను రావికోట శివరామయ్యగారు ప్రతిప్రస్థాతగను, పార్నంది రామయ్యగారు బ్రాహ్మణాచ్ఛందసిగను రేబల్లి శంకరయ్యగారు మైత్రావరుణుఁడుగను జగదేకపురము యజ్ఞయ్యగారు ప్రస్తోతగను, చేగుంట్ల వెంకటేశముగారు సోమప్రవాకగను జాలిగామ నరసింహయ్యగారు నేష్టగను రాజంపేట నానయ్యగా రగ్నీధ్రుఁడుగను, పప్పుపురుషోత్తముగా రచ్ఛావాకగను రాజంపేట రామనాథముగారు ప్రతిహారుఁడుగను ముచ్చాల నరసింహయ్యగా రున్నేతగను, పాలోఝల కృష్ణయ్యగారు పోతగను మాణిక్యావధానులుగారికుమారుఁడు సీతారామయ్యగారు గ్రావస్తోతగను, తిగుళ్ల వెంకటేశముగారు సుబ్రహ్మణ్యుఁడగను నిర్వర్తింపఁబడిన యీపౌండరీకమును బంచదశసహస్రరౌప్యవ్యయము తో వెంకటయాజులవారిచేఁ జేయించి నందా వెంకటకృష్ణయ్యగారు శాశ్వతకీర్తిని సంపాదించియున్నవాఁడు. కావున నింకను నిట్టిమహాకా

ర్యము లోకకొన్ని చేయఁజాలిన నీపుణ్యపురుషుని బరమేశ్వరుఁడు బహుకాల మాయురారోగ్యైశ్వర్యవంతునిం జేసి సంరక్షించుచుండుఁగాక

స్వస్తి సర్వేషాం సమస్తమంగళానిభవంతు

జా॥ పట్టాభిరామశాస్త్రి.

—:o:—

మహాస్రగ్ధర—
అజాఁ డాబాణాలి సాత్మీయ పటుఘనశరప్రాహతిం ద్రుంచి శస్త్ర
వ్రజ మాభూపాలకోటీరములు తడఁబడన్ సారథుల్ గూలఁజేయన్
ధ్వజముల్ రాలన్ మహాద్ధత్యమునఁదనరి గంధర్వదత్తాస్త్ర మేసెన్
విజయశ్రీకాంతుఁ డెంతే-విబుధగణము ద వ్వేడుక న్మెచ్చిచూడన్॥ 103
వ॥ తదీయప్రభావంబున॥ 104

గీ॥ నష్టచేతనులై తమ చేష్టలుడిగి। రాజులందఱు సోలిరి-రథములందు।
మొనయ నెంతయుఁబలుమూర్ఛ మునిఁగిరప్పు। డిట్లురిపులజయించి మహీశసుతుఁడు॥ 105

క॥ మెఱసెన్ దిమిరచ్ఛన్నత। దొరఁగిన మార్తాండుకరణి ధూమముదొరఁగన్।
స్ఫురియించువహ్నిక్రియ నా। వరణముదొలఁగంగ వెలుఁగుపరమాత్మక్రియన్॥ 106

క॥ చెలఁగి నిజహస్తజలరుహ। జలజముపూరించె విలయసమయజలధరో।
జ్జ్వలజలనిధికల్లోలజ। విలసితరవహాసి నినదవిభ్రమ మెసఁగన్॥ 107

మ॥ జయలక్ష్మీయుతుఁడై స్వసైన్యుఁడగుచున్ సాకేతమార్గంబునన్।
నయ మొప్పన్ నిజభార్యతోఁజనుచు గంధర్వాస్త్రముఁ గ్రమ్మరన్
దయ వారించిన నెంతయున్ దెలిసి చిన్నంబోయి రాజుల్ మహా
భయులై పోరఘునందనుండును బురప్రాంతంబుఁ జేరెన్ వెసన్ 108

సీ॥ తమసాతరంగ సత్తమ సాంద్రతర బృహత్తవ సారసాంక సంతతనదంబు
శాలిపాలివధూటిశాలిపాలితసస్యశాలిపాళీ విరాజత్పథంబు
రాజరాజసమానరాజితైశ్వర్య విరాజమానార్యవిభ్రాజితంబు
సౌరాపగాజలాసారసౌరభచరన్మారుతాంకుర మహిమైకఫలము

గీ॥ జనముదావహాసద్వస్తుఘనము నిఖిల। జీవసంజీవనము లోకపావనంబు
నైన నిజపురిచెంతకు నక్కుమారుఁ। డరుగుదేరంగఁ బురజనుల్ హర్షమలర॥ 109

సీ॥ కపురంపుటనఁటి గంబపుఁబొందులొనరించి రలఘుగృహద్వారతలములందు
ఘనసారహిమపూర కలితగంధోదకంబులు చల్లి రంగణభూములందు
నవరత్నమయతోరణములు చందురుకావి చందువగ్గట్టిరిసరణులందు
చకచకద్వైజయంతికలెత్తిరపరంజి మేలొందిమిన్నందు మేడలందు

గీ॥ తళుకుమగరాలనిగనిగల్ బెళుకులీను। కళుకుసోరణగండ్ల పొంజళుకుపటిండ్ల
సీధలింపొందురతనాలగోడలందు। వింతచిత్తరుల్ వ్రాసిరివివిధగతుల 110

వ॥ ఇట్లు పురాలంకరణంబొనర్చి 111

ఉ॥ పౌరులెదుర్కొనంగఁ బటువాద్యరవంబులు నింగిఁబొంగఁగా
సారసలోచనామణులు చల్లెడిసేసలెసంగ నెమ్మదిన్
దారడి కోరికల్ బెనఁగొనంగ నజాండు సభార్యుఁడై శుభ
శ్రీరహిఁ దల్లిదండ్రులకుఁ బ్రేమఁ బ్రణామముఁ జేసె వేడుకన్ 112

గీ॥ చేసి దీవెనలొసఁగఁగఁ జెలఁగె నప్పు । డారఘుప్రభుభార్య సహర్షయగుచు
గారవంబొప్పఁ గోడలి గారవించె । బంధుజనములు వేనోళ్లఁ బ్రస్తుతింప 113

వ॥ తదనంతరంబ యొక్క సుముహూర్తంబున. 114

సీ॥ వట్టివేళ్ళ సురఁటి వలపుకర్పూరంపు బాగాలపెట్టియ పైఁడితళుకు
చికిలిమించిన కళాచిక జాలవల్లిక వెండితంబిగ క్రొత్త విరిసరాలు
దంతపుఁబావాలు తళుక్కుదట్టము వింత చిత్తరుచందువాల్ జిలిబిలి వగఁ
గుల్కుపల్కుల చిల్క గుమిపంజరమ్ములు బకదారిపావడల్ పరిమళముల

గీ॥ భరణులపరంజి మేలుకీల్ ప్రతిమజతలు చందనాగరుధూప వాసనలుగలిగి
నూత్నవరత్నమయము మనోహరప్ర కాశగతినొప్పు కేళికా గారమునను 115

చ॥ బలరిపురత్నపుం బెళుకు భాసిలు మేలుకడాని బంగరుం
దళుకుల కోలపట్టియల దార్కొను క్రొంజిగి పట్టుపట్టెసం
ధిలు నెర నేఁతవింతనకి షీగల మంచము మించు మంచిచెం
గలువలపాన్పుపై నృపశిఖామణినందనుఁ డుండునంతటన్ 116

క॥ పెద్దలఁ జేయఁగవలె నీ । ముద్దుల జవరాలి నజుని ముచ్చట లెసఁగన్
బెద్దల ననుమతిచేనని । తద్దయు మదిలోనఁ బొడమ తాత్పర్యమునన్ 117

క॥ దరహాసచంద్రికా సుం । దరముఖ పూర్ణేందులగుచుఁ దరుణీమణు లా
శరదిందునిభానన న । వ్వరునిం గూర్పంగ నెంచి వైభవలీలన్ 118

సీ॥ నెఱులు దువ్వుచు వేణి నీటుగా నల్లరే శృంగారవేణి రంజిల్లునటుల
మేనఁ గుంకుమపూఁత మెఱుఁగు గావింపరే యనురాగమింపొంది యలరినట్లు
తళుకైన వింతసొమ్ము లలంకరించరే మించుమైదీఁగె డాల్మించునటుల
నొరపుకా నుదుటఁ గస్తురిచుక్క దిద్దరే యరచంద్రునందుఁ గందలరినట్లు

గీ॥ లలనకభినవసంగమో ల్లాసగరిమ, వెలయసింగారమొనరించి విభుని మ్రోల
నిలిపివత్తము రారమ్మ ! నేర్పుమీఱ । ననుచు నెచ్చెలులెంతయు హర్షమలర 119

సీ॥ ఇది సువర్ణపుఁజేల హిత్రవానెకనకాంగి? యజారాణి! యిది ధవళాంశుకంబు
ఘనసారగుణ? యిదే కర్పూరపేటిక గురిమొల్లవిరులివే కుందరదన?
అనువిదే సుమిళువలాక్షి? యుత్పలరాజి, పద్మిని? యిదె దళత్పద్మపంక్తి
యొనగ పున్నాగగామిని? పొన్నవిరిసరాల్, చాంపేయసుమనాస? సంపెఁగ లివె
గీ॥ యనుచు మదిలో నతిప్రియం బైనరీతి । నభిలషిత క్రముకసుమ మా ల్యతతిచేత
లలితశృంగార మొనరించి లలనయోర్తు । గెందువేడుకతోడఁ గైదండయొసఁగ 120
సీ॥ చేలాగొసంగిన చే విదల్చుచు వింత పెరయంగ నొకకొంత పెనఁగి పెనఁగి
పదవమ్మ? యనుచు నేర్పొదవ నెచ్చెలులు బెగ్గిలిపల్క నొకకొంత యలికియలికి
చలముగైకొని కూన శరుఁడేయుపూవుతూపులతాకున కొకింత యులికియులికి
చనిచనియచటనచ్చట నొయారంబుమై నిలయుచు నొకకొంత నిలిచినిలిచి
గీ॥ భయము వినయమ్ము నయము నిబ్బరము గాఁగ । నొక్కకనెపమ్ముఁ బూని జాగొనరమఱియు
మఱియుఁ జెలులొనరించు సత్వరత దనర । నసదుగాఁ దీఁగె యల్లలనాడ నపుడు 121

సీ॥ వేణిఁజుట్టినమల్లె విరిదండ రవికన్యఁ గదిసిన గంగసంగతి నెసంగ
తేటనెన్నుదుటిముత్తెపుబొట్టు లేచంద్రుసన్నిధిఁ దగు చుక్క చాలనంగ
కర్ణలత్తుమ్మలుదాల్చు కమ్మబంగారు నెత్తమ్ములనంగ హొన్నమ్మలలర
చనుగద్దెనుండు క్రొన్ననవిల్తుఁ బూజించువిరులనా హారుమంజి సరులుదనర
గీ॥ నెసఁగు చెలులెల్ల శృంగారరసమనంగ । వఱలుకస్తురిమళ్ళ డాల్వాలి పెవల్వ
కుచ్చెల చెఱంగుమట్టెల గునిసియాడ । రవలయపరంజియందెల రవళితోడ 122
మ॥ పువుదీఁగెల్ దలిరాకుగ్రమ్మరహిమైఁ బొందళుక్క చెంగావియ
న్నవక్రొంజంటి మెఱుంగుదైఁకజిగి చన్నందోయిగుల్కంగ ర
త్నవిచిత్రోజ్జ్వలభూషణప్రతతి వి న్నాణంబుమీఱంగఁ జం
దొవడాల్చందువపాన్పుటింటికిఁ జెలుల్ దోతేరఁగా వేడుకన్ 128
ఉ॥ సిగ్గునఁగొంత సేపు వగ చెయ్వులరేవల మందమంద స
మ్యగ్గమనం బొయారమొలయం గలయం జెఱునవ్వువెన్నెలల్
జగ్గనయంగఁ గొంకలెసంగ ననంగునితో త్తలీలమై
నిగ్గుచెలంగ వచ్చె రమణీమణి నాథుఁడు వేడ్కఁ జూడఁగన్ 124
గీ॥ వచ్చి నవరత్ననిర్మిత ద్వారసీమఁ । బొల్చి యావలిజిగితల్పు మూలనిల్చి
నిలయమధ్యమణిస్తంభ నికటసీమ । చాటుగా నిల్చె నెలనాగ నీటుదనర 125

క॥ తొలుకారుమెఱుపుదీఁగెన్ ; బోలన్పై శీఘ్రనంబు పోలికనవు డా
_ కలకంఠితనుద్యుతిచే । నలరెన్ దత్కేళిసౌధ మద్భుతలీలన్ 126

గీ॥ నిలిచినలతాంగి నొయ్యన నేర్పుదనర । సఖులుశయ్యాతలంబున సరగనుంచి
వరునిహస్తమునందుఁద త్కరము సేర్చి । ప్రౌఢిఁబల్కిరి చతురసంభాషణముల 127

గీ॥ పరఁగఁ గాంచనరత్నసం పర్కమట్లు । యిరువురకుమీకు దాంపత్య మొరయఁ జేసె
నజుఁడు దనపేంచెలఁగుదు వనుచు నేము । రమ్యసద్గుణహారా! యోరఘుకుమార 128

చ॥ తడవులనుండియొండొరులఁ దద్దయు వేడుక నెమ్మనమ్ములన్
దడఁబడుప్రేమనుండిరిగ దా? భవదీయమనోరథంబు లే
ర్పడఫలియించెనిచ్చో యెడ శుభస్థితిమించసుఖించుఁ డెంతయున్
వెడవిలుకానికేళిని న వీనవిలాసగతుల్ సెలంగఁగన్ 129

క॥ ఇవెకర్పూరపుబాగా, లివెపరిమళవస్తుతతు లివెగైకొనుఁడుం
త్సవమలరననుచు జిగిరో, వివెలయఁ కేళీగృహంబు వెలువడిరిచెలుల్ 130

చ॥ వెలువడియన్వధూవరుల వింతలు వేడుకఁ గొంత గన్గొనన్
దలఁచి బిసాళిపాళిని ము దంబలరంగ మెఱుంగుబంగరున్
దలఁపునవ్రాసి క్రొంబనులు దార్కొను సోరణగండ్లవెంబడిన్।
బొలిచిరి యందుఁగల్లు జిగి బొమ్మలకైవడి నేర్పుసంధిలన్॥ 131

గీ॥ కులుకునిద్దంపుబంగారు తలుపుమూసి। యొక్కొకనెపమ్ముపూనియ య్యువిదలరుగ।
నాసనాసీనయగు జల జాననం గ। నుంగొనుచుఁబల్కె నారాజ పుంగవుండు॥ 132

సీ॥ చంద్రబింబమటంచు జడియుదువనియొకో శుభకళల్గలమోముఁ జూపవేమి।
బిళిలివెన్నెలయంచుఁ జింతింతువనియొకో చిఱునవ్వుడాలింత సెరపవేమి।
మరునిచిల్కలటంచుమది నెంతువనియొకో సొలపుఁజూపులు బెళ్కఁజూడవేమి।
చిల్కపల్కులటంచుఁ జిలుకుదువనియొకో యళుకుదీరుచుమాటలాడవేమి।

గీ॥ మున్ను మున్నుగ నేపయి కొన్నదాఁక। నూరకుండెదననుచు నీ వున్నవగయొ।
రాజముఖి ముందుముందుగ రాయబార। మెవ్వరంపిరో ద్విజవర్యు నేర్పరించి॥ 132

గీ॥ అల్లశివశర్మనీరూప-మద్భుతముగఁ। జిత్రమునవ్రాసియొసఁగినఁ-జెలువుఁబూని।
చిత్తజున్మనిశరపాళిఁ-జిక్కిచాల। సొలయుచున్నాఁడ నను దయఁ-జూడుమబల 134

ఉ॥ మోచుటుద్రిప్పనేమి యొక-ముద్దిడరాదెలతాంగి? ప్రేమమై।
వేమఱు కౌఁగిలియ్యఁగద-వే? బిగిచన్గవలొమ్ముగ్రుమ్ముచున్।

లేమరో! తేనియల్ గులుకు లేనును మోవియొసంగుమిప్పుడో,
సామజయాన! యేమిటికి జాగొనరించెదు తాళరాదిఁకన్॥

గీ॥ పాలమీఁగడ శర్కర పానకంబు, పూవుఁదేనియ నైన నీ మోవియందుఁ
దనరు మాధుర్యమునకు దీటనఁగ రాదు, పరగఁ జవిచూడవలయునో సరసిజాక్షి॥ 136

తే॥ కరముఁగొనె నర్తుసంతోష కరముగాఁగ, గరము వేడుక బిగ్గైన కౌఁగిలింత,
కలువచెలువంబు గలచూపు గలయఁజూచుఁ, గలియ నదివేళయౌఁగదే కలికి యనుచు॥

॥ పలుకు తనపల్కు లమృతపుఁ, బలుకులవలెఁ దనర సిగ్గుపాటిలు తరుణిన్
గలయఁదమకించు నజుఁగని, కలకంఠులు చనిరి హాస కలితాననలై॥ 138

ఉ॥ చెక్కిలి గోటమీటుటయుఁ జేరిచనుంగవ మోము నెత్తఁ జన్
జక్కవదోయిఁ జెందెఁ బతి-సయ్యన పయ్యెదయంట నీవికిన్
గ్రక్కున దాఁటి కేలనది గ్రమ్మ విభుండు తటాన లజ్జయా,
చక్కరవిల్తునింగి నిసి పందడిక్రొవ్వక డాఁగె కాటికన్॥ 139

మ॥ అనువొందన్ సతి గారవించి నగుమో-మాస్యంబునం జేర్చి తే
ట నునుం జెక్కులు వాఁడిగోటఁ గురులంటన్ గబ్బిలేగుబ్బలన్,
దలరం గ్రొన్నెలవంకలుంచి యధరోద్యద్దంత సాంద్రక్షతల్,
గనుపట్టన్ గుసుమాస్త్రకేళి నతఁడక్కంజాక్షిఁ దేల్చెన్ వెసన్॥ 140

చ॥ అలర నవోఢయైన జలజాక్షిని ప్రౌఢను జేసె రాసుతుం
డలఘు విచిత్రబంధు మధురాధరబింబ నితాంత చుంబనా
దులఁ దమి హెచ్చఁగా మదమధువ్రత ముప్పడు దీఁగె వ్రాలిన
ట్లలవడి తమ్మిపైఁ గొదమయంచ సుఖించు నయార మేర్పడన్ 141

సీ॥ చిన్నారి నుదుటిపై జెదరిన ముంగురుల్ బెళుకుఁ గన్నులు గుల్కు నొలపుఁజూపు
మాటిమాటికి సిగ్గు మలయు డెందపుఁదమ్మి చిఱుచెమ్మటలు గ్రమ్మ మెఱుఁగుమేను
మొనపంటి సోఁకులు మొనయు విద్దపు మోవి గాఢత్వమెడలిన కౌఁగిలింత
గుదులొనర్పఁగఁబూను భావంబులోఁగోర్కె పరిపూర్ణత నెసంగు పారవశ్య

గీ॥ మతులపోనక పుటక కాంతు నలరుతరుణి, తనియ ముద్దిడ రఘురాజ తనయుతోడ
ఘనత నసమాన నూత్న సంగమసుఖాబ్ధి, నతిశయవిలాసగరిమ నోలాడె నంత 142

గీ॥ విభుఁడు మదనశాస్త్ర విఖ్యాత బహువిధ, రతివిహారరీతి నతులగతులఁ
దనియ నెఱిఁగి తానుదనిసి యుఁదనియని, దమమనోరథముల క్రమములలర 143

చ॥ అపరిమితానురాగముల సంగజురాణిఁ దృణీకరించుటల్
నిపుణతమీఱఁ బ్రాణవిభు సెమ్మదిరంజిలఁ బ్రౌఢరీతులన్
విపులపదాంగహారవము వీనులకింపొనరింప వేడ్కతో
నుపరతిసల్పెనిందుమతి యుజ్జ్వలదేహవిభన్ నటింపఁగాన్ 144

సీ॥ అగణితఘణిత రవాభిరామగ్రీవ మతులితవివిధబంధానుభావ
మాకుచ భరవ్యాకీర్ణనవహార మవిరళగళితశ్రమాంబుపూర
మతిశయోచ్ఛలిత ఫాలాగ్రాలకవ్రాత మంకురత్పులకజాలాభిజాత
మధికతరోచ్ఛ్వాస విధుతనానాభూషమంచితకరకంకణాళిఘోష

గీ॥ మానితంబనటద్వేణుకాంతమమిత, ఝణఝణత్కారాన్విత చరణహంసకముకాంచి
కావిభూషణయుతఘంటికానికాయ, మగుచు వైదర్భి పుంభావమలరె నపుడు 145

క॥ ఈగతిరఘునందనుఁడను, రాగము వెలయ న్విదర్భరాజావరజా
భోగైకనిరతసౌఖ్య, శ్రీగరిమన్ దనరె రసికశేఖరుఁడగుచున్ 146

మ॥ ఘనవిద్యానవభోజ! భోజతనయా కాంతాంఘ్రియుగ్మార్చనా
జనితైశ్వర్య విశేష! శేషఫణిభాషాగర్వవిభ్రష్టమూషీ
వినుతాత్మీయయశః ప్రవర్ధనకృదుద్వేలాఖిలాశాంతభా
గనిశశ్రీకరదాన! దానవిభవవ్యాకీర్ణగేహాంగణా 147

క॥ కాండదళనోగ్రజాగ్రద, ఖండధనుర్గళితనేక కాండపటలికా
దండితచండాహిత రాణ్మండల, చతురంగసతత మహితశుభాంగా 148

భుజంగప్రయాతము॥ మరుద్భూమిభృద్ధైర్య మాయుక్తచర్యా
సరిద్వర్యగాంభీర్య చండాతిశౌర్యా
స్ఫురన్నైజతేజోభి భూతాగ్నిసూర్యా
స్మరారాత్యంఘ్రినీరేజ చంచత్సపర్యా 149

గద్యం.

ఇది శ్రీమదఖండ సచ్చిదానంద కాశీపతి సద్గురుస్వామి చరణారవింద సేవాసమాగత
స్వస్వరూపజ్ఞాన రాజయోగ సామ్రాజ్యలక్ష్మీధురంధర జ్ఞానప్రసూనాంబికా
కాళహస్తీశ్వర కరుణాకటాక్షవీక్షణసంప్రాప్తసారసాహితీబంధురబంధు
రంజనకరచరిత్ర పాకనాటికులపవిత్ర ధూర్జటిపౌత్ర కాళయా
మాత్య లక్ష్మమాంబాకుమార, కుమారధూర్జటిప్రణీతంబైన
యిందుమతీపరిణయంబను మహాప్రబంధంబునందు
సర్వంబును షష్ఠాశ్వాసము.